సాక్షి
చిత్తూరు
ఆదివారం, 1, జూన్, 2025



ఆగని గజదాడులు

పెద్దపంజాణి మండలంలో ఏనుగుల గుంపు పంట పొలాలపై విరుచుకుపడి మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. - 8లో



రేషన్ పంపిణీ పక్కాగా చేపట్టాలి

జిల్లాలో రేషన్ పంపిణీ పక్కాగా చేపట్టాలని, లోపాలు తలెత్తకుండా ప్రత్యేక టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. - 8లో



తమ్ముళ్ల వాగ్వాదం

జీడీనెల్లూరు మండలంలో టీడీపీ ఇరు వర్గాలు నడిరోడ్డుపై వాగ్వాదానికి దిగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. - 8లో

జిల్లా సమాచారం

మండలాలు :	32
మహిళల జనాభా :	9.33 లక్షలు
మొత్తం కుటుంబాలు :	4.56 లక్షలు
రూరల్ జనాభా :	15.04 లక్షలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాల వివరాలు

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	ఖర్చు చేసిన మొత్తం (కోట్లలో)
ఈబీసీ నేస్తం	110785	128.79
జగనన్న విద్యాదీవెన	24598	67.72
హౌసింగ్ లబ్ధిదారులకు ఆర్థిక సహాయం	96449	50.83
వైఎస్సార్ చేయూత	451038	45.10
వైఎస్సార్ కాపునేస్తం	8931	37.25
జగనన్న అమ్మఒడి	11994	30.80
జగనన్న తోడు (వడ్డీ)	9012	29.51
జగనన్న వసతి దీవెన	28971	14.90
ఆరోగ్య ఆసరా	10456	7.82
జగనన్న తోడు రుణాలు	35905	1.79
వైఎసార్ ఆసరా	20456	0.49
వైఎస్సార్ నేతన్న నేస్తం	15468	0.13
వైఎస్సార్ సున్నావడ్డీ	19852	0.04
జగనన్న చేదోడు	15468	0.01
ఇళ్లపట్టాలు	167308	859.45
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	129752	243.03

గత సర్కారులో డీబీటీ ద్వారా కులాల వారీగా మహిళలకు అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధి

కులం	లబ్ధి పొందిన వారు	లబ్ధిదారులకు అందజేసిన నగదు
బీసీ	46,018	126,32,49,639
ఎస్సీ	2,359	6,71,09,756
ఎస్టీ	1,02,988	312,75,48,265
మైనారిటీ	13,150	23,41,24,416
కాపు	4,339	8,89,37,031
ఇతర కులాలు	15,085	30,10,09,390

ఎన్నికలకు ముందు మహిళల ఓట్ల కోసం చంద్రబాబు హామీల వర్షం కురిపించారు. సూపర్–6 అంటూ ఊరూరా తిరిగి నమ్మించి ఓట్లు వేయించుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల అభివృద్ధిని కూటమి ప్రభుత్వం గాలికొది లేసింది. మహిళా సంక్షేమానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా చంద్రబాబు ప్రభుత్వం మోసం చేసింది. గత వైఎస్సార్ సీపీ పాలనలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించింది. కూటమి ఏడాది పాలనలో మహిళలకు ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకపోవడంపై మహిళలు మండి పడుతున్నారు.

– చిత్తూరు కలెక్టరేట్

- ఏడాది గడుస్తున్నా అందని మహిళా సంక్షేమ పథకాలు
- గత వైఎస్సార్‌సీపీ పాలనలో మహిళలకు పెద్దపీట
- కూటమి పాలనలో కనిపించని సూపర్ సిక్స్ హామీలు
- బాబు పాలనలో కష్టాలు పడుతున్న మహిళలు
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న మహిళాలోకం

గత సర్కారులో అమలు చేసిన ఈబీసీ నేస్తం మెగా చెక్కును అందుకుంటున్న మహిళలు



గత సర్కారు నిర్మించిన గృహంలో లబ్ధిదారురాలు



ఆడబిడ్డకు అగచాట్లు!

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు పాలన జూన్ 12కు ఏడాది గడుస్తున్నా ఏ ఒక్క హామీ నెరవేర్చకపోవడంపై మహిళలు మండి పడుతున్నారు. మహిళలకు సంబంధించి ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా రూ.1500 అందజేస్తామని చెప్పినా ఆ ఊసే లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమన్నా ఇప్పటికీ వాయిదాల పర్వం కొనసాగుతోంది. తల్లికి వందనానికి సంబంధించి ఇప్పటి వరకు సొమ్ము అందించలేదు. అదే వైఎస్ జగన్ సర్కార్ హయాంలో రెండేళ్లు కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వెనుకంజ వేయకుండా ప్రజలను ఆదుకున్న పరిస్థితులను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు.



వైఎస్సార్‌సీపీ పాలనలో భరోసా



గత సర్కారులో ఉచిత ఇళ్ల పట్టాలు పొందిన నగరి నియోజకవర్గంలోని మహిళలు

2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే అమ్మ ఒడి కింద జిల్లాలోని 1,52,743 మంది తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఏటా రూ.229.11 కోట్లు ఖర్చు చేసింది. అంతే కాకుండా జిల్లాలోని రూరల్‌లో ఉన్న 95,994 స్వయం సహాయక గ్రూపులకు గాను రూ.196.98 కోట్లు, అర్బన్‌లోని 12933 స్వయం సహాయక గ్రూపులకు గాను రూ.19.90 కోట్లు చొప్పున సున్నా వడ్డీ అందించి ఆదుకుంది. వైఎస్సార్ చేయూత ద్వారా రూరల్‌లో 172616 మందికి రూ.323.66 కోట్లు, అర్బన్ లో 19144 మందికి రూ.35.9 కోట్లు, కాపు నేస్తం పథకంలో 6656 మందికి రూ.10 కోట్లు, వైఎస్సార్ ఆసరా పథకంలో రూరల్‌లో 270197 మందికి రూ.568.51 కోట్లు, అర్బన్‌లో 47026 మందికి రూ.47.70 కోట్లు చొప్పున అందించి మహిళల మనస్సుల్లో గత సీఎం వైఎస్ జగన్ సర్కార్ చెరగని ముద్ర వేసింది.

వైఎస్సార్ సీపీ పాలనలో పేదలకు ఇళ్ల పట్టాభిషేకం

గత వైఎస్సార్‌సీపీ పాలనలో చిత్తూరు జిల్లాలో 1,67,308 మందికి ఉచిత ఇళ్ల పట్టాలను అందజేసి పేద వాడి సొంతింటి కల ను నెరవేర్చింది. వారందరికీ ఉచితంగా గృహాలు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం చేశారు. కులం,మతం, ప్రాంతం, పార్టీలు ఏవీ చూడకుండా ఇంటి పట్టాలను మంజూరు చేసి మహిళల పేరుతో ఉచితంగా రిజిస్టర్ చేయించారు. గతంలో జిల్లాలో ఏర్పాటు చేసిన 1089 లే అవుట్‌లో పక్కాగృహాలతో కళ కళలాడుతున్నాయి.

ఆడబిడ్డ నిధి ఎక్కడ ?

ఎన్నికలకు ముందు ప్రతి ఇంటిలోని ఒక్కో ఆడ బిడ్డకు ప్రతి నెలా రూ.1500 చొప్పున అందిస్తామని ఊదరగొట్టిన బాబు ప్రస్తుతం ఆడబిడ్డ గురించే మరిచిపోయారు. ఒక్కొక్కరికి నెలకు రూ.1500 చొప్పున వేసుకున్నా ఏడాదికి రూ.18 వేలు అవుతుంది. ఈ సొమ్ములు మాకెప్పుడు ఇస్తారంటూ ఆడపడుచులు అడుగుతున్నారు. చిత్తూరు జిల్లాలో ఈ పథకానికి దాదాపు 4.20 లక్షల మంది అర్హులుగా ఉంటారని అధికారులు వెల్లడిస్తున్నారు. కూటమి మొదటి ఏడాదిలో జిల్లాలోని ఆడబిడ్డలు రూ.756 కోట్లు నష్టపోయారు.

ఉచిత బస్సు ఎప్పుడు ?

కూటమి టీడీపీ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఆర్టీసీ బస్సు హామీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. దీంతో జిల్లాలోని మహిళలు కూటమి టీడీపీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇంత వరకు అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు? ఇంకెప్పుడు ఆర్టీసీ బస్సు ఎక్కుతామో అని మహిళలు విమర్శలు గుప్పిస్తున్నారు. కూటమి సర్కార్ ఉచిత బస్సు ప్రయాణంపై వాయిదా పర్వం సాగిస్తుండంతో మహిళలు మండిపడుతున్నారు. జిల్లాలో 65 వేల మంది వరకు మహిళలు ప్రతిరోజు బస్సుల్లో రాకపోకలు సాగిస్తారని అంచనా.

కూటమి పాలనలో ఒక్క ఇల్లూ లేదు

కూటమి టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ఏ ఒక్క మహిళలకు ఇంటి పట్టా ఇవ్వ లేదు. పక్కా గృహం మంజూరు చేయని దుస్థితి. ఈ పథకం కొనసాగించకుండా రాజకీయ దురుద్దేశ్యంతో పలు లే అవుట్ లలో పెండింగ్‌లో ఉన్న గృహాలు కొనసాగించకుండా కూటమి సర్కారు అడ్డుకుంటోంది.

మాట నిలబెట్టుకున్నారు



గత ఐదేళ్ల పాటు ఇచ్చిన హామీ ప్రకారం పథకాలు అమలు చేసి వైఎస్ జగన్ మాట నిలబెట్టుకున్నారు. నాలుగు సంవత్సరాలు చేయూత ఆర్థిక సహాయంతో పాటు నా పిల్లలకు అమ్మఒడి పథకం లబ్ధి చేకూరింది. ప్రస్తుత కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. **– సలోమీ, గుడిపాల మండలం**

ఆడబిడ్డ నిధి ఇవ్వాలి



ఎన్నికల సమయంలో ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసి ప్రతి నెలా రూ.1500 ఇస్తామన్నారు. ఇంత వరకు ఆ పథకం అమలు గురించే పట్టించుకోలేదు. గతంలో ఏటా నా ఖాతాలోకి ఈబీసీ నేస్తం పథకం డబ్బులను జమచేశారు. గత సర్కారు పాలనలో అందిన సంక్షేమ పథకాల ఆర్థిక సాయంతో కిరాణం పెట్టుకున్నాను. ఆడబిడ్డ నిధి అమలు చేయాలి. **– సరసమ్మ, లబ్ధిదారురాలు, చిత్తూరు మండలం**

కిరాణా కొట్టు నడుపుతున్నా



గత సర్కారు పాలనలో కాపునేస్తం ద్వారా నాకు రూ.60 వేలు ఆర్థికసాయం అందింది. ఆ సాయంతో దుకాణం నడుపుతూ కుటుంబానికి అండగా ఉన్నా. ప్రస్తుతం ఇలాంటి సాయం అందలేదు. ప్రస్తుత ప్రభుత్వం కాపులకు ప్రత్యేకంగా ఎలాంటి ఆర్థిక సాయం అందించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏ హామీ అమలు చేయలేదు. **- కాటమ్మ, అత్తూరు, నింద్రమండలం చిత్తూరు జిల్లా**

పథకాలు ఎప్పుడు అమలు చేస్తారు



ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో తెలియడం లేదు. మహిళలకు ఉచిత బస్సు అన్నారు. ఇంత వరకు ఊసేలేదు. గత ప్రభుత్వం నాలుగు విడతల్లో ఈబీసీ నేస్తం నగదు అందుకున్నాను. ఆ నగదుతో కుట్టుమిషన్ కొనుగోలు చేసుకుని అభివృద్ధి చెందా. **– వనమ్మ, లబ్ధిదారురాలు, చిత్తూరు మండలం**

న్యూస్‌రీల్

కుప్పంలో '30 యాక్ట్' అమలు

కుప్పం : కుప్పం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 30 యాక్ట్ అమలు చేస్తున్నట్లు కుప్పం డివిజన్ పోలీసు అధికారి పార్థసారధి ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు సబ్ డివిజన్ పరిధిలో జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీసు యాక్ట్‌ను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ యాక్ట్ అమలు సందర్భంగా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదని అన్నారు. పోలీసుల ద్వారా అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే శాంతిభద్రతల విఘాతం కలిగిస్తున్నారని చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని చెప్పారు. సభలు సమావేశాలు నిర్వహించాలంటే అనుమతి తీసుకోవాలని సూచించారు.

మండలాలకు చేరిన ఇంటర్ పుస్తకాలు



జిల్లాలో పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మండలాలకు ఇంటర్మీడియట్ పుస్తకాలను పంపిణీ చేశారు. రాష్ట్రం నుంచి వచ్చిన పుస్తకాలను జిల్లా కేంద్రంలోని పీసీఆర్ జూనియర్ కళాశాలలో భద్రపరిచారు. వాటిని శనివారం ప్రత్యేక వాహనాల్లో మండల కేంద్రాల్లోని జూనియర్ కళాశాలలకు పంపిణీ చేశారు. జిల్లాలోని 74 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు మొదటి, రెండవ సంవత్సరం పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను సరఫరా చేశారు. మొత్తం 28,807 పుస్తకాలు వచ్చాయి. పంపిణీ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ సిబ్బంది చరణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జెడ్పీలో పలువురు బదిలీ

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి జిల్లా పరిధిలోని జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న పలువురిని బదిలీ చేసినట్లు జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు తెలిపారు. ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన వారిలో ఏఓలు 4, సీనియర్ సహాయకులు 10 మంది, జూనియర్ సహాయకులు 15 మంది, టైపిస్టులు 9, రికార్డు సహాయకుల్లో 11 మంది, రిక్వెస్టు బదిలీలో ఏఓలు 8 మంది, సీనియర్ సహాయకులు 14, జూనియర్ సహాయకులు 21, టైపిస్టు 10 మంది, రికార్డు సహాయకుల్లో 7 మందిని బదిలీ చేశామన్నారు. అదే విధంగా పదోన్నతుల్లో భాగంగా సీనియర్ సహాయకులు ఏడుగురికి ఏఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశామని వివరించారు.

చట్టం పకడ్బందీగా అమలు చేయండి



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో బాల, కౌమార కార్మిక వ్యవస్థ (నిషేధ, నియంత్రణ) చట్టం 1986 (సవరణ చట్టం 2016)ను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ..14 ఏళ్లలోపు బాలలను పనిలోకి అనుమతించకూడదన్నారు. 18 ఏళ్లలోపు వారిని పనుల్లోకి తీసుకోవడం నేరమన్నారు. బాల కార్మికులకు సంబంధించి ఫిర్యాదులుంటే 1098 నంబర్‌లో సంప్రదించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇటుక బట్టీలు, మైనింగ్ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డెయిరీ పరిశ్రమల్లో బాల కార్మికులను గుర్తించేందుకు తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం కార్మిక వ్యవస్థ నిషేధ చట్టం గోడ పత్రికలను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా కార్మిక శాఖ అధికారి ఓంకార్, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వరి, రియల్ ఎడ్యుకేషన్ , లిటరసీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు

మారిన సర్కారు బడుల రూపురేఖలు



కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకున్న కార్వేటినగరం హైస్కూల్

గత ఐదేళ్లల్లో నాడు- నేడు పథకం అమలు వివరాలు

నియోజక వర్గం	మొత్తం పాఠశాలలు	ఖర్చు చేసిన బడ్జెట్ (రూ.కోట్లలో)
చిత్తూరు	130	41.63
జీడీ నెల్లూరు	273	80.94
కుప్పం	439	152.64
నగరి	138	43.95
పలమనేరు	484	178.99
పుంగనూరు	317	93.90
పూతలపట్టు	215	58.27
మొత్తం	1996	650.32

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు గత వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలో పూర్తిగా రూపురేఖలు మారాయి. కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతులు సమకూరాయి. పూర్వపు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థపై గత ఐదేళ్లు ప్రత్యేక దృష్టి పెట్టడంతో విద్యాభివృద్ధి జరిగింది. ఇందులో భాగంగా జిల్లాలో నాడు నేడు పథకానికి వేల కోట్లు ఖర్చు చేశారు. 2019కు ముందు టీడీపీ పాలనలో సర్కారు బడుల్లో చెట్ల కింద చదువులు .. వానొస్తే బడులకు సెలవులు ఇవ్వాల్సిన పరిస్థితులు ఉండేవి. రంగులు వెలిసిపోయి...బూజు పట్టిన గోడలతో సర్కారు బడులు దర్శనమిచ్చేవి. అలాంటి పరిస్థితులను గత ఐదేళ్లల్లో రూపుమాపారు.

తమ్ముళ్ల వాగ్వాదం

- పార్టీ కార్యాలయం ప్రారంభించకనే వెనుదిరిగిన ఎమ్మెల్యే



ప్రారంభోత్సవానికి సిద్ధమై నిలిచిపోయిన వింజం టీడీపీ కార్యాలయం

గంగాధర నెల్లూరు : మండలంలోని వింజం పంచాయతీలో శనివారం స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ థామస్ ఎదుటే తమ్ముళ్ల వాగ్వాదం చోటుచేసుకుంది. వింజం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛను అందించారు. అనంతరం వింజం పంచాయతీ తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి రావాలి అంటూ ఎమ్మెల్యేను ఆహ్వానించగా అదే గ్రామంలోని మరొక వర్గం అడ్డుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముందే తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి పెద్దపీట వేస్తున్నారని మరో మండిపడింది. దీంతో ప్రారంభోత్సవం చేయకుండానే ఎమ్మెల్యే వెనుదిరిగారు. ఈ తతంగం అంతా నడిరోడ్డుపై జరగడంతో ట్రాఫిక్ అంతరాయంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అవకతవకలపై విచారణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఏపీ హంస అసోసియేషన్ అవకతవకలపై రాష్ట్ర వైద్య శాఖ విచారణకు ఆదేశించింది. ఈ నెల 3వ తేదిన డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ ముందు హాజరు కావాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యకుడికి నోటీసులు జారీ చేసింది. ఏపీ హంస సంఘం బోగస్ సభ్యులను చూపుతున్నారని, బోగస్ ఎన్నికల నిర్వహిస్తున్నారని, డబ్బులకు ఆఫీస్ బేరర్ల పోస్టులు అమ్ముకుంటున్నారని, ఆ పోస్టుల ద్వారా బదిలీల నుంచి తప్పించేలా చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో అందుకే విచారణకు ఆదేశించింది.

ఇక చౌక దోపిడీ!

- మళ్లీ పాత పద్ధతుల్లో రేషన్ పంపిణీ
- డీలర్ల చేతికి పంపిణీ పగ్గాలు
- దండుకోవడానికి ప్రభుత్వం సహకారం
- దాచుకున్న డబ్బాలు, గోనెసంచులు మళ్లీ తెరపైకి
- అక్రమాలకు అడ్డుగా ఉన్న ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు
- నేటి నుంచి చౌక దుకాణాల నుంచి పంపిణీ



రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

కాణిపాకం : జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. దీనికి కూటమి ప్రభుత్వం తోడవుతోంది. మళ్లీ పాత పద్ధతులకు శ్రీకారం చుట్టింది. దండుకోవడానికి దగ్గరుండి సహకరిస్తోంది. దీంతో రేషన్ పక్కదారి పట్టనుంది. డీలర్లు పాత డబ్బాలు, గోనె సంచులు బయటకు తీసి పూజలు చేస్తున్నారు. సరుకులు అమ్మకానికి తలుపులు తెరిచిపెట్టారు. అక్రమాలకు అడ్డుగా ఉన్నారనే నెపంతో ఎండీయూ ఆపరేటర్లను తొలగించారు. నేటి నుంచి రేషన్ దోపిడీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

జిల్లాలో 1390 రేషన్ షాపులున్నాయి. వీటి పరిధిలో 5.40 లక్షల రేషన్ కార్డులున్నాయి. వీరందరికీ ప్రభుత్వం ప్రతి నెలా ప్రభుత్వం 9 టన్నుల వరకు బియ్యం , 250 టన్నుల వరకు చక్కెర మాత్రమే పంపిణీ చేస్తోంది. ఈ సరుకుల ఆధారంగానే చాలా మంది కార్డుదారులు జీవనం సాగిస్తున్నారు. ప్రతినెలా సరుకుల అందక, డీలర్లతో పోరాటం చేయలేక పస్తులతో గడిపిన క్షణాలను కార్డుదారులు మళ్లీ గుర్తు తెచ్చుకుంటున్నారు. పాత పద్ధతి రేషన్ పంపిణీపై భయపడుతున్నారు.

2019 ముందు రేషన్ పంపిణీ ఇలా..

2019 ముందు రేషన్ పంపిణీ కోసం కార్డుదారులు పడిగాపులు కాసేవారు. అప్పట్లో ప్రజలకు సకాలంలో సరుకులు అందేవి కావు. కాస్త ఆలస్యమైతే రేషన్ లేదని వెనక్కి పంపించేసే వారు. ఇచ్చిన సరుకుల్లో కోతలు కనిపించేవి. గోనె సంచి, డబ్బాలతో తూక మేసి.. రేషన్‌మేసేసేవాళ్లు. ఇలా భారీగా రేషన్‌ల్లో కోతలు పడేవి.

2019 తర్వాత రేషన్ సరఫరా ఇలా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు మేలు చేసేలా చేసింది. ప్రధానంగా రేషన్ పంపిణీలో పారదర్శకతను తీసుకొచ్చింది. ఇంటింటికీ రేషన్ విధానాన్ని అమలు చేసింది. వాహనం కేటాయింపుతో పాటు ఎండీయూ ఆపరేటర్లను నియమించింది. ఈ విధానంతో ప్రతి నెలా 1వతేది నుంచి 17 తేదీ వరకు వీధి వీధికి వెళ్లి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేసేది. లేవలేని వృద్ధులు, నడవలేని వృద్ధులకు ఇబ్బంది ఉండేది కాదు. ఇక పాత పద్ధతిలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట పడింది. డీలర్ల ఆటలకు తాళం పడింది.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ మాఫియాకు ఊపిరొచ్చింది. ప్రతినెలా లక్షల రూపాయలు విలువ చేసే రేషన్ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు జోరందుకుంది. టన్నుల కొద్ది బియ్యం పోలీసుల కంట పడి వెలుగులోకి రావడంతో కూటమి నేతల అక్రమ వ్యాపారం బట్ట బయలైంది. అక్రమ వ్యాపారులుగా అవతారమెత్తిన కూటమి నేతలు పలు రేషన్ డీలర్లతో చేతులు కలిపి ఈ దందాను నడిపిస్తున్నారు. అక్రమ వ్యాపారానికి అడ్డుగా ఉన్న డీలర్లను తొలగించి వారికి అనుకూలంగా ఉన్న కూటమి నేతలకు డీలర్లుగా నియమించుకున్నారు. ఇలా ఈ ఏడాది కాలంలో 300 మంది డీలర్లను కొత్తగా నియమించారని తెలుస్తోంది. విదేశాల్లో ఉన్న మహిళ పేరిట కూడా రేషన్ షాపు కేటాయించారంటే...దీని బట్టీ రేషన్ బోగస్‌ను అంచనా వేయవచ్చు. అలాగే అక్రమ వ్యాపారానికి అడ్డుగా ఉన్న 336 మంది ఎండీయూ ఆపరేటర్లను తొలగించింది. దీంతో ఇంటింటా రేషన్ పంపిణీ వ్యవస్థ రోడ్డున పడింది.

రాగులు, కందిపప్పునకు రాంరాం

కందిపప్పునకు ప్రభుత్వం మంగళం పాడింది. రాగులు పంపిణీ ఆపేసింది. నేటి నుంచి మళ్లీ పాత పద్ధతులు రానున్నాయి. రోజుకు 8 గంటలు రేషన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. డీలర్లు వారి వద్ద కార్డుదారులను క్యూ కట్టించనున్నారు. అప్పుడే కొన్ని చోట్ల డబ్బాలు, గోనె సంచులు సిద్ధం చేసి ఉంచారు. అన్ని రకాలుగా కోతలు పెట్టేందుకు సంసిద్ధమయ్యారు. రేషన్ పండగ పేరుతో కార్డుదారుల నుంచి పిండుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. పాత పద్ధతి రేషన్ పంపిణీపై క్షేత్రస్థాయిలో విమర్శలు వెలువెత్తుతున్నాయి.

తూకంలో తేడాలొస్తే చర్యలు



రేషన్ పంపిణీ పకడ్బందీగా జరిగేలా చూస్తాం. అందుకే కొంత మందితో కూడిన ఓ టీంను ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా తిరుగుతున్నాం. మళ్లీ ఐదు రోజులపాటు జిల్లాలోనే ఉంటాం. రేషన్ పంపిణీలో ఏ సమస్య వచ్చిన వెంటనే స్పందిస్తాం. కోతలుంటే చర్యలు ఉంటాయి. కార్డుదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– రాజేంద్ర ప్రసాద్, ప్రత్యేక అధికారి, చిత్తూరు

జిల్లా సమాచారం

షాపుల సంఖ్య :	1339
కార్డుదారులసంఖ్య :	5.40 లక్షలు
బియ్యం సరఫరా ప్రతినెలా :	9వేల టన్నులు
చక్కెర :	256 టన్నులు
తొలగించిన డీలర్ల సంఖ్య :	300 మంది
తొలగించిన ఎండీయూ ఆపరేటర్ల సంఖ్య :	336

ఏడాది కాలంలో పట్టుకున్న రేషన్ వివరాలు ఇలా..

నెల	6ఏ కేసులు	పట్టుబడ్డ బియ్యం (క్వింటాళ్లల్లో)
జూన్–2024	1	6.16
ఆగష్టు	8	131.9
సెప్టంబర్	6	93.98
అక్టోబర్	1	24.1
నవంబర్	3	18.65
డిసెంబర్	4	316.56
ఫిబ్రవరి–25	3	110.99
మార్చి	2	104.57

రేషన్ పంపిణీ పక్కాగా చేపట్టాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి పాత పద్ధతిలో రేషన్ పంపిణీ చేయనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేక అధికారిని నియమించింది. లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేంద్ర ప్రసాద్‌ను కేటాయించింది. శనివారం ఆయన డీఎస్‌ఓ శంకరన్‌తో కలిసి చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వేయింగ్ మిషన్లు, ఈ–పాస్ యంత్రాల పనితీరును పరిశీలించారు. డీలర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం డీలర్లకు యంత్రాలను అందజేశారు. రేషన్ పంపిణీలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఓ ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ–పాస్ యంత్రాల్లో సాంకేతిక సమస్యలు ఎదురైతే ప్రవీణ్‌కుమార్, పురుషోత్తం, నరసింహ అందుబాటులో ఉంటారని వివరించారు.

మధ్యాహ్నభోజన పోటీల్లో జిల్లాకు 2వ స్థానం



రాష్ట్ర స్థాయి అవార్డును స్వీకరిస్తున్న జిల్లా విద్యాశాఖ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించి ఇటీవల రాష్ట్ర స్థాయిలో సిబ్బందికి శిక్షణ పోటీలు నిర్వహించారు. విజయవాడలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా తరపున మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొని ప్రతిభ చాటారు. బడి పిల్లలకు శుభ్రత, ప్రకృతి వైపరీత్యాలు, ఉరుములు మెరుపులు వచ్చినప్పుడు, అగ్నిప్రమాద సమయంలో ఎలా తప్పించుకోవాలనే అంశాలపై వంట కార్మికులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన సిబ్బందికి పోటీలు నిర్వహించగా ఇందులో చిత్తూరు జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 2వ స్థానం లభించింది. ఈ అవార్డు పొందిన, గత 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను డీఈవో వరలక్ష్మి, ఏడీ వెంకటేశ్వరరావు అభినందించారు.

ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి



లారీ చక్రాల కింద చంద్రశేఖర్

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట మండలం తిరుపతి– చెన్నై జాతీయ రహదారిపై కదిరి మంగళం బైపాస్ వద్ద ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో చంద్రశేఖర్ (35) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకొంది. పోలీసు కథనం మేరకు వివరాలు ఇలా.. వడమాలపేట కట్టకింద ఎస్టీ కాలనీకి చెందిన చంద్రశేఖర్ కదిరి మంగళం బైపాస్ వద్ద రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య సుభాషిణి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు.

నేటి నుంచి చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇకపై రేషన్ షాపుల్లోనే రేషన్ పంపిణీ జరుగుతుందని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో రేషన్ పంపిణీ కార్యక్రమం డీలర్ల ఆధ్వర్యంలో ఆదివారం, సెలవు రోజుల్లో పంపిణీ చేస్తారన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ ఉంటుందన్నారు. నిత్యావసర వస్తువుల సరుకులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్డుదారులకు పంపిణీ చేస్తారన్నారు. పోర్టబులిటీ సౌకర్యం అందుబాటులో ఉన్నందున కార్డుదారులు తమకు సమీపంలోని ఏ రేషన్ షాపులోనైనా సరుకులు పొందవచ్చని తెలిపారు.

పీసీఆర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ 2వ తేదీ నుంచి కళాశాలలు పునఃప్రారంభం కానున్నట్లు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు తెలుగు, తమిళ మీడియంలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంబైపీసీ, ఎంఈసీ కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని వసతులతో ఉన్న పీసీఆర్ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపల్ కోరారు.

ఆదర్శ గ్రామాల పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని ఎంపిక చేసిన 5 ఆదర్శ గ్రామాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. 5 వేలకు పైగా జనాభా కలిగిన పంచాయతీల్లో వందశాతం సోలార్ విధానం ప్రవేశపెట్టాలన్నారు. ఇందులో ఒక పంచాయతీని ఎంపిక చేసి మొదట శతశాతం పనులు పూర్తి చేయాలని ఆదేశించారన్నారు. పెనుమూరు, గుడిపాలలోని బొమ్మసముద్రం, విజయపురంలోని పల్లూరు, చౌడేపల్లె, కల్లూరు పంచాయతీలను ఎంపిక చేశారన్నారు. వీటికి సంబంధించి సంబంధిత ఈఈలతో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అక్కడ వసతులు, సోలార్ విధానం పెట్టుకోవడానికి ఆసక్తి ఉన్నవారు ఎంత మంది ఉన్నవారు, ఇతర కేటగిరీ సర్వీసుల వివరాలు, మొత్తం సర్వీసుల సంఖ్య వివరాలు తీసుకుంటున్నామన్నారు. అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేస్తే కేంద్రం సంబంధిత పంచాయతీ అభివృద్ధి పనులకు రూ.కోటి నిధులు విడుదల చేస్తుందన్నారు.

దుప్పిని కాల్చి చంపిన కేసులో జైలు



నిందితుడిని అరెస్టు చేసిన అటవీ శాఖ అధికారులు

కుప్పం : కుప్పం అటవీ రేంజ్ పరిధిలోని మల్లప్పకొండ అటవీ ప్రాంతంలో చుక్కల దుప్పిను కాల్చిన కేసులో నిందితుడిని రిమాండుకు పంపినట్లు అటవీ శాఖ అధికారి జయశంకర్ తెలిపారు. కుప్పం మండలం వాలూరు గ్రామానికి చెందినా కనకరాజ్ గుడుపల్లె మండలం మల్లప్పకొండ అటవీ ప్రాంతంలో చుక్కల దుప్పిని వెటాడి నాటు తుపాకితో కాల్చి చంపినట్లు తెలిపారు. అటవీ శాఖ అధికారులకు వచ్చినా సమాచారం మేరకు మల్లప్పకొండ ప్రాంతంలో పర్యవేక్షించగా కనకరాజ్ దుప్పి చర్మంతో ద్విచక్ర వాహనంలో వెళుతుండగా అదపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడితో పాటు నాటు తుపాకి , ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఆగని గజ దాడులు

- మామిడి చెట్లు ధ్వంసం





పెద్దపంజాణి : ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు, ఏనుగుల దాడిలో నేలరాలిన మామిడి కాయలు

పెద్దపంజాణి : గజరాజులు బీభత్సం సృష్టిస్తున్నాయి. రైతులు సాగు చేసిన పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాలైన పెద్దకాప్పల్లి, ముదిరెడ్డిపల్లి, జిట్టంవారిపల్లి, గౌరీనగర్, ఆకులవారిపల్లి, కొత్తబూరగపల్లి, తిప్పిరెడ్డిపల్లి, పెనుగొలకల గ్రామాల రైతుల పొలాలపై కొంత కాలంగా ఏనుగుల గుంపు పంటలకు తీవ్రనష్టం కలిగిస్తున్నాయి. శుక్రవారం రాత్రి పుంగనూరు రేంజ్ పేటూరు ఫారెస్టు బీట్ నుంచి వచ్చిన 14 ఏనుగుల గుంపు పెద్దకాప్పల్లి గ్రామ రైతులు రమణారెడ్డి, సుభాషణరెడ్డి తదితరులకు చెందిన మామిడి తోటలపై విరుచుకుపడ్డాయి. మామిడి కొమ్మలు విరిచేసి సగం కాయలు తిని, మిగిలిన సగాన్ని తొక్కి నాశనం చేసి కీలపట్ల బీట్‌లోకి వెళ్లాయి. ఈ దాడుల్లో యాభై వేల రూపాయలు నష్టం జరిగినట్లు అంచనా. ఇప్పటికే మామిడికి గిట్టుబాటు ధరలేక అన్నదాతలు అవస్థలు పడుతుంటే, ఏనుగులు దాడి చేసి మరింత నష్టాన్ని చేకూరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులు పంటలపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్



హరికృష్ణారెడ్డి మామిడి తోటలో టెంకాయ చెట్టును పెకిలించిన ఏనుగు

రొంపిచెర్ల : మండలంలోని బండ కిందపల్లె, పెద్దగొట్టిగల్లు పంచాయతీలో శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. అన్నమ్మయ్య జిల్లా పీలేరు మండలం పూట్లావారిపల్లె నుంచి రాత్రి బయలుదేరి కమోళ్లపల్లె, మటోళ్లపల్లె, బండకింద పల్లె దళిత వాడ రామిరెడ్డిగారిపల్లె వైపు వెళ్లింది. మటోళ్లపల్లె సమీపంలోని గాలి చెరువు వద్ద అర్ధరాత్రి పెద్దగా శబ్దాలు చేసుకుంటూ రావడంతో మామిడి తోటల వద్ద కాపలాగా ఉన్న రెడ్డెప్ప దంపతులు చెట్టు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. హరికృష్ణారెడ్డి మామిడి తోటలో టెంకాయ చెట్టును పెకలించింది. భాస్కర్ రెడ్డి పొలం వద్ద ఉన్న ముళ్ల కంచెను విరిచి బండకిందపల్లె వైపు వెళ్లింది. రొంపిచెర్ల మండల సరిహద్దులోని మామిడి తోటల్లో ఒంటరి ఏనుగు ఉండడంతో రైతులు పరుగులు తీశారు.